క్లుప్తంగా

ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలి



పెదకాకాని: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని గ్రామ సర్పంచి కర్నాటి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు జెడ్పీహెచ్ స్కూల్‌లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం సందర్భంగా జాతీయస్థాయి, రాష్ట్ర స్థాయిలో ఫుట్‌బాల్ ఆడిన విద్యార్థిని తాడిబోయిన శ్రీలక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. జెడ్పీహెచ్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న శ్రీలక్ష్మి చదువులో ప్రథమ శ్రేణిలో రాణిస్తూనే రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి ఫుట్‌బాల్ జట్టులో ఆడటం ప్రసంశనీయమన్నారు. క్రీడల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న వ్యాయామోపాధ్యాయుడు వినయ్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం శ్రీలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి డి.బూసిబాబు, ఎంపీటీసీ సభ్యుడు మోపర్తి శ్రీనివాసరావు, సుబ్బారావు, పీఈటీ వినయ్ కుమార్, ఉపాధ్యాయులు, గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు పాల్గొన్నారు.

పెన్షన్ మంజూరు కోరుతూ నిరసన



వీసీ చాంబర్‌లో కింద కూర్చుని నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

పెదకాకాని: యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకులకు ఫిబ్రవరి నెలకు సంబంధించిన పెన్షన్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు బుధవారం నిరసనకు దిగారు. యూనివర్సిటీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆచార్య విష్ణువర్ధన్, కార్యదర్శి శివప్రసాద్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు వీసీ ఆచార్య కె.గంగాధరరావును ఆయన చాంబర్లో కలిశారు. రెగ్యులర్ ఉద్యోగులకు ఫిబ్రవరి నెలకు సంబంధించిన జీతాలను యూనివర్సిటీ నిధుల నుంచే చెల్లించారని, విశ్రాంతి అధ్యాపకేతర ఉద్యోగులకు కూడా వర్సిటీ నిధుల నుంచే చెల్లించారని కానీ యూనివర్సిటీలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన రెగ్యులర్ అధ్యాపకులకు మాత్రం నిధులు లేవన్న సాకుతో పెన్షన్ నిలిపియడం సరికాదని వారు వీసీ దృష్టికి తీసుకొచ్చారు. తమ సమస్య పరిష్కరించాలని పట్టుబట్టారు. పెన్షనర్లకు డీఏ బకాయి ఉందని దానిని కూడా వెంటనే చెల్లించాలని కోరారు. తమ సమస్య పరిష్కరించే వరకు తాము నిరసన విరమించమని వీసీ చాంబర్లో పెన్షనర్లు నేలపై కూర్చున్నారు. అనంతరం వీసీ కే గంగాధరరావు, రెక్టార్ కే రత్నషీలా మణి, రిజిస్టర్ జి.సింహాచలం పెన్షనర్లతో చర్చలు జరిపారు. సోమవారాని విశ్రాంత అధ్యాపకులకందరికీ పెన్షన్లు చెల్లిస్తామని, డీఏ బకాయి కూడా వెంటనే చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

వీవీఐటీని సందర్శించిన కెనడా మంత్రి



కెనడా మంత్రి రయాన్ వార్డ్‌తో కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో ద్వైపాక్షిక సంబంధాల కోసం రాష్ట్రంలో పర్యటిస్తున్న న్యూఢిల్లీలోని కెనడా హైకమిషన్ మంత్రి(వాణిజ్య వ్యవహారాలు) రయాన్ వార్డ్, హైదరాబాద్ కెనడా ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్తో కలసి వీవీఐటీ కళాశాలను బుధవారం సందర్శించారు. మండలంలోని నంబూరు కళాశాలలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్‌లతో కలసి మౌలిక వసతులు, సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, గూగుల్ కోడ్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు కెనడాలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్, స్టూడెంట్ ఎక్సేంజ్ తోపాటుగా ఉపాధితో కూడిన ఉన్నత విద్యనందించేందుకు దోహదపడుతుందని వివరించారు. విద్యార్థులకు భారతదేశం, కెనడాల మధ్య పరిశోధనా కార్యకలాపాలను రూపొందించేందుకు వీలుపడేలా కెనడా మంత్రితో చర్చలు సాగినట్లు వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు కెనడాలో ఉన్న విద్యా ఉపాధి అవకాశాలపై వివరించారు.

పెదకాకానిలో దొంగను పట్టించిన సీసీ కెమెరా



పెదకాకాని: కూల్‌డ్రింక్ షాపునకు అమర్చిన సీసీ కెమెరా ఆధారంగా దొంగను అదుపులోకి తీసుకున్న ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రవి ఇంటికి సమీపంలోని పల్లాలమ్మ చెరువు కట్ట వద్ద కూల్‌డ్రింక్‌షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో రెండు సార్లు గుర్తు తెలియని దొంగలు షాపు తాళాలు పగులగొట్టి అందులో ఉన్న నగదు, సామానులు తీసుకెళ్లారు. దీంతో షాపు నిర్వాహకుడు తన షాపు మొత్తం కనిపించేలా సీసీ కెమెరాలు అమర్చి అందులో రికార్డు అయిన సమాచారం సెల్‌ఫోన్‌లో చూసుకునేలా ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో కుక్కలు అరవడంతో మేల్కొన్న రవి సెల్‌ఫోన్ చూసుకోగా అందులో షాపు ముందు ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉండటాన్ని గుర్తించాడు. షాపులో దొంగతనం జరుగుతుందని భావించి చుట్టు పక్కల వారిని నిద్రలేపి అక్కడకు చేరుకున్నారు. వారిని చూసి షాపు ముందు కాపలాగా ఉన్న ఇద్దరు పరారీ అయ్యారు. షాపులోకి చొరబడిన షేక్ సాజిత్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితుడు క్రోసూరుకు చెందిన సాజిత్‌గా గుర్తించారు. పరారీ అయిన వారిలో అచ్చంపేటకు చెందిన ఇక్బాల్, మరొక వ్యక్తి ఉన్నట్లు సమాచారం . కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

నకిలీ డ్వాక్రా గ్రూపులపై కేసు నమోదు

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలో నకిలీ డ్వాక్రా గ్రూపుల పేరుతో రుణాలను పొందిన వారిపై డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశారు. నల్లపాడు సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. గ్రామంలో పలువురు ఎటువంటి ఆధారాలు లేకుండా 11 నకిలీ డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి నల్లపాడు జీడీసీసీ బ్యాంక్‌లో కోటి పదహారు లక్షల రూపాయల రుణాలను పొందారు. గతంలో ఇదే బ్యాంక్‌లో మిర్చి రైతుల పేర్లతో కోట్లాది రూపాయల కుంభకోణం వెలుగు చూసిందని గుర్తు చేశారు. గ్రామానికి చెందిన పలువురు రక్షిత, సారా, తస్లీమా, స్వర్ణలాంటి పలు మహిళా గ్రూప్‌ల పేర్లతో రుణాలు తీసుకున్నారని ఎటువంటి చెల్లింపులు జరగకపోవటంతో విచారించగా నకిలీ గ్రూపులని తేలిందని చెప్పారు. నల్లపాడు పోలీసులు నకిలీ గ్రూప్‌లపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కాకుమాను: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ పి.వెంకాయమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుని మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు చిన్నారులకు ప్రతి రోజు ఆటలపాటలతో కూడిన విద్యనందించడంతో పాటు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని కోరారు.

8న సావిత్రీబాయి పూలే గ్రంథావిష్కరణ సదస్సు

పొన్నూరు: మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో లోకాయత పబ్లికేషన్స్, రాష్ట్ర దళిత మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో కవి డాక్టర్ కత్తి పద్మారావు రచించిన 92వ గ్రంథమైన సావిత్రీబాయి పూలే గ్రంథావిష్కరణ సదస్సు నిర్వహించనున్నట్లు పబ్లికేషన్స్ ఉపసంచాలకులు కత్తి చేతన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో 700 పేజీలతో ప్రచురించిన గ్రంథాన్ని బి. గృహలక్ష్మి, కత్తి స్వర్ణకుమారి ఆవిష్కరిస్తారని తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రేటూరు(కాకుమాను): వ్యర్థాల వలన అనర్థాలు మన వెంటే ఉంటాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని బాపట్ల జిల్లా డాక్టర్ ఎన్‌టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన డాక్టర్ ఎ.అశోక్ కుమార్ అన్నా రు. జాతీయ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామంలోని వీధులలో వ్యర్థాలను బుధవారం శుభ్రం చేయించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు సేవా కార్యక్రమాలు అలవాటు చేయాలనే లక్ష్యంతో ప్రతి ఏటా వారం రోజుల పాటు ఒకటి, రెండు గ్రామాలను ఎంచుకుని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం అధికారి డాక్టర్ డి.విజయ్ కుమార్, డాక్టర్ కె.లావణ్య, కిషోర్ పాల్గొన్నారు.

బాజీబాబా దర్గాలో హుండీ కానుకలు లెక్కింపు



పెదకాకాని: బాజీబాబా దర్గాలో హుండీ కానుకలు లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు హుండీలను తెరచి కానుకలు లెక్కింపు చేపట్టారు. వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. ఆరు నెలల కాలంలో దర్గాలో ఉన్న ఆరు హుండీల ద్వారా బాజీబాబా వారికి 16,69,450 రూపాయలు ఆదాయం లభించినట్లు దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపారు. అలానే హుండీల ద్వారా 100 గ్రాములు వెండి, విదేశీ నోట్లు లభించాయన్నా రు. ఈ హుండీలకానుకలు లెక్కింపును వక్ఫ్‌బోర్డు సూ పరింటెండెంట్ షేక్ మహ్మద్‌హుస్సేన్, రాష్ట్ర వక్ఫ్‌బో ర్డు అకౌంటెంట్ సయ్యద్ ఆదంషఫీ పర్యవేక్షించారు.

ఈలపాట రఘురామయ్య స్మారక నాటకోత్సవం



సుద్దపల్లి(చేబ్రోలు): ఈలపాట రఘురామయ్య జయంతి సందర్భంగా పద్మశ్రీ ఈలపాట రఘురామయ్య కల్చరల్ అసోసియేషన్, సమైఖ్య గ్రామాభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాటకోత్సవాలు ప్రారంభించారు. తొలుత కల్యాణ మండపం సమీపంలోని ఈలపాట రఘురామయ్య విగ్రహానికి గ్రామస్తులు, పెద్దలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సుద్దపల్లి గ్రామానికి చెందిన కల్యాణం రఘురామయ్య ఈలపాటనే ఇంటిపేరుగా చేసుకున్న గొప్ప కళాకారుడు, వెండితర నటుడిగా రఘురామయ్య ఖ్యాతి గాంచారని కల్చరల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

రెండు పౌరాణిక నాటక ప్రదర్శనలు

రఘురామయ్య జయంతి సందర్భంగా బుధవారం రాత్రి కల్యాణమండపంలో సమత నాటక గురుకులం వారు, కనకదుర్గా నాట్యమండలి పల్నాటి యుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈలపాట రఘురామయ్య కమిటీ ప్రతినిధులు గోవాడ మోహనరావు, కట్టా భానుమూర్తి, మట్టుపల్లి పోతురాజు, నల్లనూకల రంగారావు, తోట రామాంజనేయులు, సాంబశివరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కాకుమాను: మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక(మెయిన్)పాఠశాలలో అమలవుతున్న భోజన పథకాన్ని బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవి పాల్గొన్నారు.

మా ఉసురు ఊరికే పోదు..

- జీవనోపాధిని తొలగిస్తే ఆత్మహత్యే శరణ్యం
- కన్నీటి పర్యంతమైన మహిళ
- ఉద్రిక్తంగా మారిన బడ్డీ కొట్టు తొలగింపు చర్య

పొన్నూరు: బడా వ్యాపారులు రోడ్లను ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నా ఆ వైపు కన్నెత్తి చూడని మున్సిపల్ అధికార యంత్రాంగం ఓ మహిళకు చెందిన చిన్న బడ్డీ కొట్టును తొలగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. మున్సిపల్ కార్యాలయంలో విభాగాల్లో పని చేసే అధికారులు హఠాత్తుగా వచ్చి దుకాణం తీసేయాలని చెప్పడంతో ఆందోళనకు గురైన మహిళ తన జీవనోపాధిని తొలగిస్తే ఆత్మహత్యయే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేసిన సంఘటన బుధవారం పొన్నూరు పట్టణంలో జరిగింది. వివరాలు.. తండ్రి లేని ఇద్దరు ఆడపిల్లలను పోషించుకునేందుకు పట్టణానికి చెందిన ఓ మహిళ పట్టణ ప్రధాన రహదారిలోని కొప్పాక వెంకయ్య మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఓ టీ స్టాల్ ముందు చిన్న సిగరెట్ దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తోంది. బుధవారం మున్సిపల్ ఆర్వో తోట వెంకటేశ్వరరావు, టీపీఓ రఘురాం తమ సిబ్బందితో కలసి దుకాణం వద్దకు వచ్చి నిబంధనలకు విరుద్ధంగా దుకాణం ఏర్పాటు చేశారని, వెంటనే దుకాణం తీసివేయాలని టీ స్టాల్, సిగరెట్ దుకాణం నిర్వాహకులను ఒత్తిడి చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తనకు సమాచారం ఇవ్వలేదని, కొంత సమయం ఇవ్వాలని మహిళ అధికారులను కోరినా వారు అంగీకరించలేదు. దుకాణంలోని వ్యాపార సామగ్రిని తొలగించే చర్యను అధికారులు చేపట్టడంతో మహిళ ఆవేదనకు గురైంది. బతుకు తెరువు కోసం ఏర్పాటు చేసుకున్న దుకాణం తొలగిస్తే ఆత్మహత్యే శరణ్యమని వాపోయింది. ప్రధాన రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నా పట్టీ పట్టనట్లు వ్యవహరించే అధికారులు.. పొట్టకూటి కోసం ఓ మహిళ ఏర్పాటు చేసుకున్న మూడు అడుగుల బంకు తొలగించడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబును వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దుకాణం తీసేయమని పలు సార్లు హెచ్చరించాం. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా తొలగింపు చర్యలు చేపట్టాం.

నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో అఘోరి ఫిర్యాదు

గుంటూరు రూరల్: హిందూ ఐక్య పోరాట వేదిక నాయకుడు అనిల్ బెహరా తనకు సెల్‌ఫోన్‌లో వీడియో కాల్ ద్వారా బెదిరించాడని లేడీ అఘోరి బుధవారం గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రాజేష్‌నాథ్ రాసలీలలను తాను బయటపెట్టినందుకు అతని బినామీ అయిన అనిల్ బెహరా తనను వీడియోకాల్ ద్వారా బెదిరించాడని అఘోరి తెలిపింది. తనకు గానీ, తన వద్ద ఆశ్రయం కోరి వచ్చిన రాజేష్‌నాథ్ బాధితురాలికి గానీ ఎలాంటి హాని జరిగినా దానికి కారణం రాజేష్‌నాథ్, అనిల్ బెహరాలే కారణమని విలేకరులతో అఘోరి తెలిపారు. ఈ మేరకు నల్లపాడు సీఐ వంశీధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిప్స్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తుందని చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర తెలిపారు. బుధవారం చౌడవరంలోని కళాశాలలో ఒమేగా హెల్త్ కేర్(చెన్నై), మెడిటెక్ హైర్ (బెంగళూరు), వేదిక్ బిజినెస్ సొల్యూషన్స్(బెంగళూరు) సంస్థలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయని చెప్పారు. ఈ ఎంపికల్లో పలు విభాగాల్లో కళాశాలకు చెందిన 98 మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను పొందారని తెలిపారు. ఒమేగా హెల్త్ కేర్‌లో ట్రైనీ మెడికల్ కోడర్ ఉద్యోగానికి రూ.2.6 లక్షల నుంచి రూ.3 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ, మెడిటెక్ హైర్, వేదిక్ బిజినెస్ సొల్యూషన్స్‌లలో మెడికల్ రైటింగ్ స్పెషలిస్ట్ ఉద్యోగానికి రూ.3.5 లక్షల వార్షిక వేతనంతో పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ సీఎన్ శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ ఆర్.గోపాలకృష్ణ అభినందించారు.